క్లుప్తంగా

పోలింగ్ బూత్ తనిఖీ చేసిన ట్రైనీ కలెక్టర్



అల్లంపాడులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సంజనా సిన్హా

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ట్రైనీ కలెక్టర్ మండలంలోని ఖాదర్‌పూర్ ప్రతిపాదిత పోలింగ్ కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. తమ ప్రాంతంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేయడంతో పరిశీలించారు. మొత్తం 530 ఓట్లు ఉన్నాయని, క్షేత్రస్థాయిలో సమస్యను తెలుసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఆమె తెలిపారు. అల్లంపాడు పోలింగ్ బూత్‌కు పరిసరాల్లో ఉన్న రెండు పంచాయతీల నుంచి నిర్ణీత సమయంలో రాకపోకలు సాగించాలంటే తాము పడుతున్న ఇబ్బందులు ప్రజల నుంచి తెలుసుకున్నామన్నారు. డిప్యూటీ తహసీల్దారు ఆనంద్‌రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రజత పతక విజేతకు అభినందనలు



రజత పతక విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: అండర్–12 జాతీయ కుస్తీ పోటీల్లో రజత పతకాన్ని పొందిన ఆత్మకూరు జేఆర్‌పేటకు చెందిన విద్యార్థి సుబ్బరాజు విజయవర్ధన్‌ను పలువురు అభినందించారు. ఇటీవల హరియాణాలో నిర్వహించిన కుస్తీ పోటీల్లో విజయవర్ధన్ జాతీయ స్థాయిలో రజత పతకాన్ని పొందారు. ట్రస్ట్ అధ్యక్షుడు జవహర్ లాల్, కేతా చిన్న మస్తాన్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి: రైతుభరోసా పథకం ద్వారా ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహాయం కోసం కొత్తగా రైతులు తమ పేర్లను ఆర్బీకేల్లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల వద్ద నమోదు చేసుకోవాలని ఏఓ ఆంజనేయులునాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకేవైసీ చేసుకుంటునే రైతులకు రైతు భరోసా, పీఎం కిసాన్ నిధులు అందుతాయని చెప్పారు.

గణిత అధ్యాపకుల సంఘం అధ్యక్షుడిగా సందానిబాషా



సందాని బాషా

చేజర్ల: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళాశాలల గణిత అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా షేక్ సందానిబాషా ఏక్రగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం కళాశాల ప్రిన్సిపల్ వాసుబాబు, పలువురు అధ్యాపకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

బాధ్యతగా జగనన్న సురక్ష సర్వే చేయండి

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ఈ నెల 22 నుంచి ప్రారంభం కానుందని, సంబంధిత సిబ్బంది బాధ్యతగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. క్లస్టర్ల పరిధిలో సర్వేకు ఒక రోజు ముందుగానే సచివాలయ సిబ్బంది వెళ్లి వివరించాలన్నారు. మున్సిపల్ పరిధిలోని 8 సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

20 మందికి పింఛన్ల పంపిణీ

చేజర్ల (సోమశిల): అనంతసాగరం మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం అర్హులైన 20 మందికి కొత్తగా పింఛన్లు పంపిణీ చేశారు. గౌరవరంలో 5 మంది, మంగపల్లిలో 8, కామిరెడ్డి పాడులో ఏడుగురికి రాష్ట్ర క్రీడా సంఘం డైరెక్టర్ కాలువ నర్సింహులు, మాజీ సర్పంచ్, సచివాలయ కన్వీనర్లు గోపిరెడ్డి పద్మజారెడ్డి, ఎం చంద్రశేఖర్ పింఛన్లను పంపిణీ చేశారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు పై హర్షం

చేజర్ల: మహిళా రిజర్వేషన్ బిల్లుపై మండల బీజేపీ నేతలు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మహిళలపై ఎనలేని గౌరవం ఉందన్నారు. బీజేపీ నాయకులు కుంకు బాలయ్య, బత్తల కృష్ణయ్య, ప్రేమ్‌చంద్, భాస్కర్‌రెడ్డి, హజరత్ ప్రధాన మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

మర్యాద పూర్వకంగా..

ఉదయగిరి: ఉదయగిరి ఎంపీడీఓగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న ఈశ్వరమ్మ బుధవారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. దుత్తలూరులోని పార్టీ కార్యాలయంలో కలిసి పూలమాల, శాలువతో సత్కరించారు.

జైజై గణేశా.. బైబై గణేశా

- సముద్ర తీరంలో కోలాహలంగా వినాయక నిమజ్జనం
- బారులు తీరిన విగ్రహాలు
- యువత సందడే సందడి
- నిమజ్జనం సజావుగా సాగేలా పోలీసుల చర్యలు
- తీరం వద్ద అప్రమత్తంగా గజఈతగాళ్లు









తీరంలో నిమజ్జనానికి బారులు తీరిన గణనాథులు

కావలి: నియోజకవర్గంలోని కావలి, బోగోలు, అల్లూరు తీరాల్లో బుధవారం వినాయక నిమజ్జనం కోలాహలంగా జరిగింది. మూడు రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. బాణసంచా, తప్పెట్లు, తీన్మార్, రంగులు చల్లుకోవడం, చిందులు నడుమ నిమజ్జనం యాత్ర శోభాయానంగా జరిగింది. కావలి పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వినాయక విగ్రహాలు మండలంలోని తుమ్మలపెంట, కొత్తసత్రం గ్రామాల్లో సముద్ర తీరంలో నిమజ్జనం చేశారు. విగ్రహన్ని ఒక వాహనంలో, దాని వెంట భక్తులు మరో వాహనంతో తరలి రావడంతో తీరంలో సందడి నెలకొంది. దారిపొడువునా గణనాథులు పాటలు హోరెత్తాయి. కావలి రూరల్ ఎస్సై శెట్టిపల్లి సుమన్ తన సిబ్బందితో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా దారిపొడవునా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. తీరంలో నీటిలోకి భక్తులు పోకుండా గజఈతగాళ్లు అప్రమత్తంగా ఉండి సూచనలు చేశారు. సముద్రం కూడా ప్రశాంతంగా ఉండడంతో భక్తులు నిమజ్జనం అనంతరం తనివి తీరా సముద్రస్నానం ఆచరించారు. పట్టణంలో టు టౌన్ పోలీసులు ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో విగ్రహాలతో ఉన్న వాహనాలు క్రమబద్ధంగా తీరం వైపు వెళ్లే మార్గంలో తరలిపోయేలా చేశారు.

వైభవంగా గణేశ్ విగ్రహాల ఊరేగింపు



ఆత్మకూరు: కోలాహలంగా ఆర్యవైశ్య బజారులో ఏర్పాటు చేసిన విగ్రహం ఊరేగింపు



ఆత్మకూరు: చెరువు వద్ద క్రేన్ సహాయంతో విగ్రహాలకు నిమజ్జనం నిర్వహిస్తున్న దృశ్యం

- ఆత్మకూరు చెరువులో నిమజ్జనం

ఆత్మకూరు: వినాయక చవితి సందర్భంగా తాత్కాలిక మండపాల్లో ప్రతిష్ఠించిన గణనాథుడి విగ్రహాలకు మూడు రోజుల పాటు విశేష పూజలు నిర్వహించి బుధవారం అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆత్మకూరు చెరువులో నిమజ్జనం చేశారు. పట్టణంలోని నాగేంద్రపురం, బ్రాహ్మణవీధి, తోటవీధి, చల్లావీధి, సుందరమ్మ ఆలయం దగ్గర, వైశ్యా బజార్, జేఆర్‌పేట, ఎల్ఆర్‌పల్లి, ఏసీఎస్ఆర్‌కాలనీ, వందూరుగుంట, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనం కోసం వాహనాల్లో విశేషంగా అలంకరించి గ్రామోత్సవాలు చేశారు. డీజే సంగీతానికి యువకుల నృత్యాలు, రంగులు చల్లుకుంటూ మహిళలు పాల్గొనడం విశేషం. సీఐ జి.వేణు, ఎస్సై కె.ముత్యాలరావు తమ సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. చెరువు వద్ద మున్సిపల్ కమిషనర్ కె.నాగేశ్వరరావు, ఏఈ ప్రసాద్ ఆధ్వర్యంలో నిమజ్జనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్రేన్ ద్వారా చెరువులో భారీ విగ్రహాలను నిమజ్జనం చేసేలా ఏర్పాట్లు చేశారు. లైటింగ్, తగిన బందోబస్తు మధ్య విగ్రహాల నిమజ్జనం రాత్రి పదిన్నర గంటల వరకు సాగింది.

వేడుకగా గణనాథుడి నిమజ్జనోత్సవం



సంగం: సంగంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమల్లోని కొన్నింటిని బుధవారం యువత ట్రాక్టర్లపై ఊరేగింపుగా తీసుకొచ్చి జైబోలో గణేష్ మహారాజ్‌కీజై అంటూ నినాదాల నడుమ సంగం పెన్నానదిలో బుధవారం నిమజ్జనం నిర్వహించారు. సంగం శివాజీ సెంటర్, కొత్తూరు, పాతూరు, రాళ్లచెలిక తదితర ప్రాంతాలతో పాటు అన్ని గ్రామీణ ప్రాంతాల కూడళ్లలో భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి అత్యంత భక్తిశ్రద్ధలతో ఆయా ప్రాంత వాసులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సంగం పెన్నానది, గాంధీజన సంఘం వద్ద కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువలో వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ రవినాయక్, ఎస్సై నాగార్జునరెడ్డి సిబ్బందితో భద్రతా చర్యలు చేపట్టారు.

వేడుకగా వినాయక నిమజ్జనోత్సవాలు



కలిగిరి: వినాయకుని నిమజ్జనం సందర్భంగా యువకుల సందడి

ఉదయగిరి: నియోజకవర్గంలో ఊరూరా, వీధి వీధిన ఏర్పాటు చేసిన గణనాథులను మూడో రోజు బుధవారం వేడుకగా నిమజ్జనం చేశారు. ఉదయగిరి, వింజమూరు పట్టణాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల్లో కొన్నింటిని మాత్రమే నిమజ్జనం చేశారు. తప్పెడు, తాళాలు, బాణసంచా సందడి నడుమ యువత కోలాహలంతో వినాయకుడి విగ్రహాలు భారీ ఊరేగింపుతో చేశారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు చేశారు.

నిమజ్జనానికి గణనాథులు

కలిగిరి: గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలను బుధవారం నిమజ్జనానికి తరలించారు. విగ్రహాల వద్ద యువకులు ఉట్టి కొట్టి సంబరాలు జరుపుకున్నారు.

కోలహలంగా నిమజ్జనం

కొండాపురం : కొండాపురం మండలంలోని 19 పంచాయతీలలో వినాయక చవితి సందర్భంగా సుమారు 40 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. బుధవారం పలు ప్రతిమలను నిమజ్జనానికి రంగరంగ వైభవంగా తరలించారు. మండలంలోని కొమ్మి, కొండాపురం, ఎర్రబెల్లి, సాయిపేట గ్రామాల్లోని ఈ ప్రతిమలను స్థానికంగా చెరువుల్లో నిమజ్జనం చేశారు. స్థానికంగా ఉండే చెరువులు, కుంటల్లో నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేశారు.



కొండాపురం: కొమ్మి బీసీ కాలనీ విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

పోలీసులు చర్యలు తీసుకున్నారు. అలాగే కమిటీ సభ్యులు వారి పరిధిలో ఏర్పాటు చేసి ఉన్న వినాయక ప్రతిమలను

నిమజ్జనానికి తరలిన గణనాథులు

జలదంకి: మండలంలోని గ్రామాల్లో కొలువుదీరిన వినాయక విగ్రహాలను బుధవారం నిమజ్జనానికి తరలించారు. తొలుత యువకుల కేరింతల నడుమ విగ్రహాల వద్ద ఉట్టి కొట్టే మహోత్సవాన్ని నిర్వహించారు. పలు విగ్రహాల వద్ద ఉంచిన లడ్డూను వేలం పాట నిర్వహించారు. స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేయగా కొన్ని విగ్రహాలను కావలి మండలం తుమ్మలపెంట సముద్రంలో నిమజ్జనం చేశారు.

ఆర్టీసీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



ఆర్టీసీ గ్యారేజీలో ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలి ఆర్టీసీ బస్టాండ్‌ను ఆధునికీకరించడానికి, ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం ఎమ్మెల్యే కావలి ఆర్టీసీ బస్టాండ్‌ను, గ్యారేజీని సందర్శించారు. కావలి డిపో మేనేజర్ ఆర్. శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) కేవీఆర్ బాబు, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి.రవి ప్రకాష్, ఇతర సూపర్‌వైజర్లు, సిబ్బంది, ఉద్యోగ సంఘ నాయకులు సాదరంగా పుష్పగుచ్ఛాలతో శాలువా కప్పి ఆహ్వానించారు. బస్టాండ్‌లో ఉన్నటు వంటి డ్రైనేజీని మెరుగు పరిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. గ్యారేజీని సందర్శించి సిబ్బందితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దాదాపు 600 మంది ఆర్టీసీ కార్మికుల కుటుంబాలు తాము రెండుసార్లు గెలుపొందడానికి యూనియన్లకు అతీతంగా ఇచ్చిన మద్దతు ఒక కారణమని, వారికి మెరుగైన పింఛన్ ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. గ్యారేజీలో కూలింగ్ వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేయడానికి అంగీకరించారు. గ్యారేజీ యార్డ్ కాంక్రీట్ ఫ్లోరింగ్ చేయించడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారం అయ్యే విధంగా అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తానని హామీ ఇచ్చారు. గ్యారేజీలో అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ ఖాజామొయిద్దీన్, వారి సూపర్‌వైజర్లు, సిబ్బంది, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనుమర్లపూడి వెంకటనారాయణ, కుందుర్తి శ్రీనివాసులు, గంధం ప్రసన్నాంజనేయులు, చెన్ను ప్రసాద్‌రెడ్డి, గుడ్లూరు మాల్యాద్రి పాల్గొన్నారు.

మోపెడ్‌ను ఢీకొన్న కారు

- యువకుడికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు

సంగం: కారు మోపెడ్‌ను ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన సంగం కావలి కాలువ వద్ద నెల్లూరు– ముంబయి జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై ఆత్మకూరు నుంచి బుచ్చిరెడ్డిపాళెం వైపు వెళ్తున్న ఓ యువకుడు కావలి కాలువ వద్దకు వచ్చే సరికి చెన్నై నుంచి ప్రయాణికులతో వస్తున్న కారు మోపెడ్‌ను ఢీకొంది. దీంతో ఆ యువకుడు తీవ్రంగా గాయపడి రక్తపు మడుగులో పడి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు.108 వాహనంలో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారును స్వాధీనం చేసుకున్నారు. క్షతగాత్రుడు అపస్మారక స్థితిలో ఉండడంతో రాజస్థాన్‌కు చెందిన పానిపూరి వ్యాపారిగా భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీజీ కోర్సులకు అనుమతి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పట్టణంలో ఉన్న నేతాజీ డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సులకు యోగి వేమన యూనివర్సిటీ నుంచి కొత్తగా అనుమతులు వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికంగా ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

కరాటేలో మున్సిపల్ విద్యార్థుల ప్రతిభ



కోచ్‌తో అక్క తమ్ముడు

కావలి: పట్టణంలోని పాతూరు మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు కరాటేలో ప్రతిభ కనబరిచారు. నెల్లూరులో జరిగిన నేషనల్ లెవల్ కరాటే చాంపియన్‌షిప్– 2023లో కావలి పాతూరు మున్సిపల్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న ఎండీ వాజిద ఎల్లో బెల్ట్‌లో సిల్వర్, బ్రాంజ్ మెడల్ సాధించారు. అదే పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎండీ జునైద్, ఎల్లో బెల్ట్‌లో గోల్డ్, బ్రాంజ్ మెడల్ సాధించారు. వీళ్లిద్దరూ అక్క, తమ్ముడు కావడం గమనార్హం. 8వ తరగతి చదువుతున్న నీతూరెడ్డి గోల్డ్, బ్రాంజ్, 10వ తరగతి విద్యార్థి షేక్ ఇమ్రాన్ గోల్డ్, బ్రాంజ్ పతకాలు సాధించారు. వీరికి కోచ్‌గా హుస్సేన్ శిక్షణ ఇస్తున్నారు.

తీరం.. జనసంద్రం



బిట్రగుంట: తాటిచెట్లపాళెం తీరం వద్ద సందడిగా సాగుతున్న నిమజ్జనాలు

బిట్రగుంట: బోగోలు మండలం తాటిచెట్లపాళెం సముద్ర తీరం వద్ద వినాయప్రతిమల నిమజ్జనోత్సవం బుధవారం సందడిగా సాగింది. బోగోలు, దగదర్తి మండలాలతో పాటు అల్లూరు మండలాల నుంచి భారీ సంఖ్యలో గణేష్ ప్రతిమలు నిమజ్జనానికి తరలివచ్చాయి. యువత, మహిళలు జైబోలో గణేష్ నినాదాలతో హోరెత్తించారు. ఎటువంటి ప్రమాదాలు తలెత్తకుండా బిట్రగుంట పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సిబ్బంది బృందాలుగా ఏర్పడి ట్రాఫిక్ స్తంభించకుండా, తీరం వద్ద రద్దీ లేకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. ముందస్తు జాగ్రత్తగా స్థానిక మత్స్యకారులతో పాటు గజ ఈతగాళ్లను తీరంలో సిద్ధంగా ఉంచారు. సాయంత్రం ఆరు గంటల వరకే తీరానికి వచ్చిన విగ్రహాలను నిమజ్జనానికి అనుమతిస్తామని ముందుగానే ప్రకటించడంతో నిర్వాహకులు కూడా నిర్దేశిత సమయంలోపే విగ్రహాలను తీరం వద్దకు తీసుకువచ్చారు.

నెల్లూరుపాళెం గణేశ్ లడ్డూకు రికార్డు స్థాయి ధర



లడ్డూను వేలం పాటలో దక్కించుకున్న హజరత్తయ్య దంపతులు



లడ్డూను దక్కించుకున్న హరీష్‌నాయుడు దంపతులు

ఆత్మకూరు: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక మండపాల్లో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాలకు నైవేద్యంగా పెట్టిన లడ్డూలకు బుధవారం వేలం నిర్వహించారు. అయితే నెల్లూరుపాళెం వద్ద ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో లడ్డూకు రికార్డు స్థాయి ధర లభించింది. పోటా పోటీగా సాగిన ఈ వేలం పాటలో చెరుకూరు హజరత్తయ్యనాయుడు రూ.60,116లకు లడ్డూను వేలంలో దక్కించుకున్నారు. అనంతరం ఆయన్ను ఇంటి వరకు ఊరేగింపుగా నిర్వాహకులు తీసుకెళ్లారు. లడ్డూ వేలం పాట నిర్వహించి ఆ నగదును గణేష్ ఉత్సవాలకు ఉపయోగించడం ఆనవాయితీగా వస్తుందని నిర్వాహకుడు, కౌన్సిలర్ చెరుకూరు కామాక్షయ్య నాయుడు తెలిపారు.

రూ.40,501 పలికిన లడ్డూ

పట్టణంలోని బీఎస్సార్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద లడ్డూను పట్టణానికి చెందిన హరీష్‌నాయుడు దంపతులు రూ.40,501లకు వేలం పాటలో దక్కించుకున్నారు.



లడ్డూ వేలంపాటలో భక్తులు

పంచముఖ శక్తి గణపతి లడ్డూ వేలం

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం డీసీపల్లిలో కొలువై ఉన్న శ్రీపంచముఖ శక్తి గణపతి వద్ద మూడు రోజులుగా ప్రత్యేక పూజలు అందుకున్న నేతి లడ్డూకు ఆలయ నిర్వాహకులు వేలం నిర్వహించారు. నంద్యాల కేశవరెడ్డి, రమాదేవి కుటుంబ సభ్యులు రూ.7500లకు దక్కించుకున్నారు. ఆలయంలో విశేష పూజలు, హారతులు, అర్చనలకు ఉభయకర్తలుగా రేవూరు నారాయణ రెడ్డి, పద్మావతి దంపతులు వ్యవహరించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి పట్టా

- ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి



మాట్లాడుతున్న ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి

సీతారామపురం: అర్హులైన ప్రతి లబ్ధిదారుకి ఇళ్ల స్థలాలు అందించి, వారికి ఇళ్లు కట్టించే బాధ్యత ప్రభుత్వం తీసుకుందని, ఇందు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సమావేశం జరిగింది. ఎంపీపీ పద్మావతి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి మంచి జరిగిందన్నారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి కుటుంబానికి 100 శాతం పని కల్పించాలని కోరారు. మరో 20 ఏళ్లు జగనన్న ముఖ్యమంత్రిగా ఉంటారన్నారు. దీంతో రాష్ట్రంలో ప్రజలందరికీ కష్టాలు తీరుతాయన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీరాజ్ శాఖను ఆదేశించారు. రైతులకు అన్ని పథకాలు అందేలా చూడాలని వ్యవసాయ శాఖను కోరారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వం వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు అందుతున్నాయని, పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మండల చింతంరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీడీఓ రంగసుబ్బారాయుడు, తహసీల్దార్ సుధాకర్‌బాబు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ఉపాధ్యాయులతో ఎంపీపీ పద్మావతి, సుబ్బారెడ్డి

సీతారామపురం: జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డులు పొందిన ఉపాధ్యాయులకు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ పద్మావతి మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. ఎంతో మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చిన ఘనత ఒక ఉపాధ్యాయుడికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నేత చింతంరెడ్డి సుబ్బారెడ్డి, ఎంఈఓ మస్తాన్ వలీ, ఎంపీటీసీలు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరురూరల్: తపాలా శాఖలో ప్రజల కోసం అందిస్తున్న పలు పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు సబ్ డివిజన్ తపాలా శాఖ సూపరింటెండెంట్ రాజగోపాల్ తెలిపారు. మండలంలోని కళాశాల విద్యార్థులకు పోస్టల్ శాఖ అమలు చేస్తున్న పథకాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ పథకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మెయిల్ ఓవర్సీస్‌లు సీహెచ్ వెంకయ్య, వై మాలకొండయ్య, బీపీఎం, ఏబీపీఎంలు, తదితరులు పాల్గొన్నారు.

తపాలా జీవితా బీమాపై అవగాహన

ఉదయగిరి: గ్రామీణ తపాలా జీవిత బీమాపై ఉదయగిరి పట్టణ ప్రజలకు అవగాహన కల్పిస్తూ తపాలా శాఖ ఉద్యోగులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో యూనియన్ రోడ్డు, మెయిన్ రోడ్డు, నాగలబావివీధి తదితర ప్రాంతాల్లో తిరిగి ప్రచారం కల్పించారు. బీమా ద్వారా లభించే ప్రయోజనాలను వివరించే ఫ్లెక్సీ ప్రదర్శించారు.